


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ శనివారం 09-03-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 66 పేజీలు : 4 వెల : రూ 2-00

## కాళ్ల బేరానికి వచ్చిన అహంకారం

హైదరాబాద్, మార్చి 8 (న్యూస్ పల్స్) రాజకీయాలన్నాకా పదవులు వస్తుంటాయి, పోతుంటాయి. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగొద్దు. అధికారం కోల్పోయినప్పుడు బాధపడొద్దు. తమిళనాడులో కరుణానిధి, జయలలిత రాజకీయాలు చేసినప్పుడు ఒకరినొకరు ఇబ్బంది పెట్టుకునేవారు. కోర్టుకు లాక్కునేవారు. జైలుకు ఈడ్చుకునేవారు. వారిద్దరి మరణం తర్వాత అక్కడ అలాంటి రాజకీయాలు దాదాపు కనుమరుగయ్యాయి. వారిద్దరూ బతికి ఉన్నంత కాలం పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనేది. ఇలాంటి రాజకీయాలు మంచివి కావని వారికి చెబితే.. వారు వినిపించుకునేవారు కాదు.. అందుకే రాజకీయాల్లో ఉండేవారు పరిణతి, విజ్ఞత ప్రదర్శించాలి

# మహిళా దినోత్సవ కానుక



న్యూఢిల్లీ,మార్చి8: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని మహిళలకు భారీ కానుక ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ..మహిళా దినోత్సవ కానుకగా ఎల్పిజి సిలిండర్ల ధరలను తగ్గిస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఈ ప్రకటన చేశారు.ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో రూ.100 తగ్గింపు ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రకటించారు. సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ఎక్స్ లో ప్రధాని మోదీ ఈ సమాచారాన్ని ఇచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎల్‌పీజీ సిలిండర్ల ధరను రూ. 100 తగ్గించినట్టు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనపై విపక్షాలు స్పందించాయి. మహిళా దినోత్సవం సందర్భంగా నారీ శక్తిని బలపరిచే క్రమంలో వంట గ్యాస్ ధరను

### సిలిండర్‌పై వంద తగ్గించిన మోడీ

### ఎన్నికల జిమ్మిక్కు అంటూ విపక్షాల విసుర్లు

సిలిండర్‌కు రూ. 100 చొప్పున తగ్గించాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అయితే కేంద్రం నిర్ణయంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తూ ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ ఎత్తుగడేనని, ఇది మోదీ సర్కార్ మోసపూరిత చర్యని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే ఆక్షేపించారు. గత తొమ్మిదేండ్లు గా అధికారంలో ఉన్న కాషాయ పాలకులకు గతంలో ఇలా ఎందుకు ఆలోచించలేదని ఆమె ప్రశ్నించారు. ఎన్నికలు ముంచుకొచ్చినప్పుడే వారికి గ్యాస్ ధరల భారం గుర్తుకువచ్చిందా అని నిలదీశారు. తమ ప్రభుత్వ హయాంలో గ్యాస్ సిలిండర్ కేవలం రూ. 430కే లభించేదని గుర్తుచేశారు. గత ఏడు నెలలుగా గ్యాస్ ధరలను ఎందుకు తగ్గించలేదని, ఎన్నికలకు ముందు ఇప్పుడే ఇలా ఎందుకు చేశారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే కేంద్రాన్ని నిలదీశారు. బీజేపీ తెలివైన పార్టీ అని వారు రూ. 395 విలువైన సిలిండర్లను రూ. 1000కి విక్రయిస్తూ ఇప్పుడు ప్రధాని మోదీ దాన్ని రూ. 100 తగ్గించినట్టు ఆర్భాటంగా ప్రకటించారని కాంగ్రెస్ ప్రతినిధి సురేంద్ర రాజ్‌పుట్ వ్యాఖ్యానించారు. తృణమూల్ నేత సాఘరికా ఘోష్ సైతం గ్యాస్ ధరల తగ్గింపు ప్రకటించిన సమయాన్ని తప్పుపట్టారు. గత కొన్ని నెలలుగా మహిళలు వంట గ్యాస్ భారాన్ని మోయలేకున్నారని, గ్లోబల్ మార్కెట్‌లో ధర తగ్గినా దేశీ మార్కెట్‌లో తగ్గించలేదని, ఇప్పుడు ఎన్నికల ముందు రూ. 100 తగ్గించారని ఆమె పేర్కొన్నారు. భారత్‌కు ప్రధాన మంత్రి అవసరమని, ఎన్నికల మంత్రి అవసరం లేదని ఆమె దుయ్యబట్టారు.

# రాజ్యసభకు సుధామూర్తి.. 'నారీ శక్తికి నిదర్శనం': మోదీ

న్యూఢిల్లీ: మహిళా దినోత్సవం రోజున ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రచయిత, సామాజిక వేత్త, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి సతీమణి సుధా మూర్తిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు



నామినేట్ చేశారు.సుధామూర్తి ఎంపికపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేస్తూ.. ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఈ ప్రకటన చేయడం సంతోషంగా ఉందన్నారు. రాజ్యసభలో ఆమె ప్రాతినిధ్యం భారత 'నారీ శక్తి'కి శక్తివంతమైన నిదర్శమని మోదీ పేర్కొన్నారు.సామాజిక సేవలో సుధామూర్తి స్ఫూర్తిదాయక ముద్ర వేశారని కొనియాడారు. విద్య, దాతృత్వంతో సహా విభిన్న రంగాల్లో ఆమె చేసిన కృషి అపారమైనదని ప్రశంసించారు. మహిళల శక్తి, సామర్థ్యాలను చాటిచెప్పేలా ఆమె పార్లమెంట్ పదవీకాలం ఉన్నతంగా సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ట్విటర్‌లో పోస్టు చేశారు.కాగా సుధామూర్తి.. భారతీయులకు పరిచయం అక్కర్లేని వ్యక్తి. టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణమూర్తి సతీమణిగానే కాకుండా రచయిత్రి, విద్యావేత్త సామాజిక వేత్తగా అందరికీ సుపరిచితురాలే. తన కోసం మాత్రమే కాకుండా సమాజం కోసం ఆలోచించే వారు అతి తక్కువమంది కనిపిస్తుంటారు. అలాంటి వారిలో సుధామూర్తి ముందువరుసలో ఉంటారు. వేల కోట్లకు అధినేత అయినా.. సింప్లీ సిటీకి మారుపేరులా ఉంటారు. సుధామూర్తి సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి ఇటీవల భారత ప్రభుత్వం ఆమెను పద్మభూషన్ అవార్డుతో సత్కరించిన విషయం తెలిసిందే.

## మహిళా వ్యతిరేక ప్రభుత్వంగా రేవంత్ సర్కార్: ఎమ్మెల్సీ కవిత ఫైర్

హైదరాబాద్: మహిళా వ్యతిరేక ప్రభుత్వంగా కాంగ్రెస్ రేవంత్ ప్రభుత్వం మారుతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.కానీ, జీవో-3 తీసుకువచ్చి ఉద్యోగాల్లో మహిళలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.కాగా, ఎమ్మెల్సీ కవిత ఈరోజు ఇందిరా పార్క్ వద్ద భారత్ జాగృతి ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు జరుగుతున్న అన్యాయం, జీవో-3 రద్దు డిమాండ్ చేయాలని ధర్నాకు దిగారు. ఈ కార్యక్రమంలో భారత్ జాగృతి శ్రేణులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రాజ్యాంగం వచ్చిన తర్వాత మహిళల కోసం అనేక చట్టాలు చేసుకుంటూపోతున్నాం. మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్నాయి. తెలంగాణ వచ్చాక మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు పోలీస్ శాఖలో కల్పిస్తున్నాం. ప్రతీ యూనివర్సిటీలో మహిళల సంఖ్య పెరిగింది. పోటీ పరీక్షల్లో మహిళలే టాప్ వస్తున్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లు కావాలనే కేసీఆర్ కోరారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి




వచ్చింది.కానీ, జీవో-3 తీసుకొచ్చి ఉద్యోగాల్లో మహిళలకు అన్యాయం జరిగేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రభుత్వం తెచ్చిన జీవో-3 వల్ల మహిళలకు కేవలం 12 శాతం మాత్రమే ఉద్యోగాలు వస్తాయి. మహిళా వ్యతిరేక ప్రభుత్వంగా రేవంత్ ప్రభుత్వం మారుతోంది. ప్రజలను కలవడంలేదని కేసీఆర్‌ను విమర్శించిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఆయనెందుకు ప్రజలకు కనపడటం లేదు. ఆయన ఢిల్లీ నేతలనే మాత్రమే కలుస్తారు. తెలంగాణ ప్రజలను రేవంత్ కలవడు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## సిరుల సింగరేణి ప్రగతి పథంలో మరో ముందడుగు.. గుడ్ న్యూస్ చెప్పిన భట్టి

ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిశారు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. కేంద్ర అనుమతి లేక ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో తాడేపల్లి సెకండ్ బ్లాక్ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.తాడిచర్ల-2 కోల్ బ్లాక్ కి అప్రూవల్‌పై కేంద్రం సానుకూలంగా స్పందించడం శుభవార్త అన్నారు డిప్యూటీ సీఎం.తాడిచెర్ల రెండో బ్లాక్‌లో 5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం వుందన్నారు భట్టి విక్రమార్క. సింగరేణికి, రాష్ట్రానికి ఇది ప్రయోజనమన్నారు. ఒడిషాలోని నైని కోల్ బ్లాక్‌లో తెలంగాణకు కేటాయింపులు చేసినప్పటికి అందుకు సంబంధించి ఆపరేషన్స్ ఇంకా మొదలు కాలేదు. ఆ విషయంలో కూడా కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి సానుకూలంగా స్పందించారన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.అటు కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్కే సింగ్‌తోనూ



సమావేశమయ్యారు భట్టి విక్రమార్క. గ్రీన్ పవర్ సహా ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై చర్చించారు. పేదల ఇళ్లకు సోలార్ కరెంట్ అందించేలా కేంద్రం ఇచ్చే సబ్సిడీ కి అదనంగా మరింత ఖర్చును భరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పథకాన్ని కేంద్రమంత్రికి వివరించారు భట్టివిక్రమార్క. అభినందడంతో పాటు తప్పక చేయూతనిస్తామని ఆర్కేసింగ్ సానుకూలంగా స్పందించారన్నారు.తెలంగాణకు ఎంతో ప్రయోజనం కల్గించే రెండు ముఖ్య అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించడంపై హర్షం వ్యక్తం చేశారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.


## తొలిసారి నేషనల్ క్రియేటర్స్ అవార్డుల అందజేత




న్యూఢిల్లీ:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారి జాతీయ క్రియేటర్స్ అవార్డులను శుక్రవారం అందజేశారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది.మొత్తం 20 విభాగాల్లో అవార్డులను అందజేశారు. కాగా సృజనాత్మక వీడియోలు, కథనాలతో సమాజంలో మార్పు కోసం కృషి చేస్తున్న కంటెంట్ క్రియేటర్స్‌ను ప్రోత్సహించేందుకు అవార్డులను కేంద్రం నూతనంగా ప్రవేశపెట్టింది.వీటిలో స్టోరీ టెల్లింగ్, సెలబ్రిటీ, సామాజిక మార్పు, వ్యవసాయం, సాంస్కృతిక, ట్రావెల్, పర్యావరణ పరిరక్షణ, విద్య, ఆహారం,క్రియేటివిటీ, న్యూ ఇండియా చాంపియన్,టెక్, గేమింగ్, హెరిటేజ్ ఫ్యాషన్ వంటి వివిధ రంగాల్లో ఉత్తమ కంటెంట్ అందించిన క్రియేటర్స్‌ను గుర్తించి వారికి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను అందిస్తోంది.స్టోరీ టెల్లింగ్, సామాజిక మార్పు, పర్యావరణ పరిరక్షణ, విద్య, గేమింగ్‌తో సహా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారిని గుర్తించి, ప్రోత్సహించడమే ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశమని ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.ఈ అవార్డుల కోసం 20 విభాగాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 1.5 లక్షల నామినేషన్స్ వచ్చాయి. వారికి మద్దతుగా పది లక్షల మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులోంచి 23 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. వీరిలో ముగ్గురు అంతర్జాతీయ క్రియేటర్స్ ఉన్నారు. మోస్ట్ క్రియేటివ్ క్రియేటర్ అవార్డును మహిళల విభాగంలో శ్రద్ధ, పురుషుల విభాగంలో ఆర్జే రౌనాక్ అందుకున్నారు.

## కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం..


హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం అందింది. దేశంలోనే అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో మొదటి వరుసలో నిలిచే ఐఐటీ మద్రాస్ తమ విద్య సంస్థలో జరిగే అంట్రపెన్యూరల్ సమ్మిట్ అనే కార్యక్రమంలో ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. ప్రతి ఏటా ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే అంట్రపెన్యూరల్ ఫెస్టివల్ (ఇ-హబీఎఐతిబి) ఈ- సమ్మిట్ లో కీలకోపన్యాసం చేయాలని కోరింది.ఐఐటీ మద్రాస్‌లో ప్రతి ఏటా నిర్వహించే ఈ- సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి అంట్రపెన్యూరల్ రంగంలో కీలకమైన వ్యక్తులను, సంస్థల అధిపతులను, పాలసీ మేకర్లను, ప్రముఖ వ్యక్తులను ఆహ్వానిస్తుంది. కేటీఆర్‌కున్న అపారమైన అనుభవాన్ని పురస్కరించుకొని, భవిష్యత్తు అంట్రపెన్యూరల్ ఔత్సాహికులకు దిశా నిర్దేశం చేయాల్సిందిగా కేటీఆర్‌కు పంపిన ఆహ్వానంలో ఐఐటీ మద్రాస్ పేర్కొంది.ఐఐటీ మద్రాస్ విద్యార్థులు ప్రతిఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దేశంలోనే అంతర్జాతీయ గుర్తింపు ఐఎస్ఓ సర్టిఫికేషన్ కలిగిన ఏకైక కార్యక్రమంగా నిలిచింది. రేపు, ఎల్లుండి జరగనున్న ఈ కార్యక్రమానికి హాజరై ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌కు పంపిన ఆహ్వానంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి పీయూష్ గోయల్, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఒకరైన క్రిస్ గోపాలకృష్ణన్, హెచ్‌సీఎల్ సహ వ్యవస్థాపకులు అజయ్ చౌదరి వంటి ప్రముఖులు హాజరై ప్రసంగించనున్నట్లు ఐఐటీ మద్రాస్ తెలిపింది.



## నేడు కాంగ్రెస్ తొలి జాబితా.. మళ్లీ వయనాడ్ నుంచే రాహుల్

### 40 మంది పేర్లను ఖరారు చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈసారి కూడా కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) ఢిల్లీలో సమావేశమైంది. 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించి 60 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చించారు. పోటీ చేసే 40 మంది అభ్యర్థుల పేర్లను సీఈసీ గురువారం రాత్రి ఖరారు చేసింది. అభ్యర్థులను నేడు ప్రకటించనుంది హస్తం పార్టీ..ఢిల్లీ, కర్ణాటక, కేరళ, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, సిక్కిం, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయా, లక్షద్వీప్‌కు సంబంధించి పలు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేశారు. సీఈసీ సమావేశంలో ఖర్గే, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. కేరళలో తమ పార్టీ 16 స్థానాల్లో పోటీ చేయబోతోందని కాంగ్రెస్ నేత వి.డి.సతీశన్ చెప్పారు. తమ మిత్రపక్షాలకు 4 స్థానాలు కేటాయించామన్నారు.ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భుపేష్ బఘేల్ రాజ్‌నంద్‌గావ్ నుంచి, మాజీ మంత్రి తామ్రధ్వజ్ సాహూ మహాసముంద్ నుంచి పోటీ



చేయనున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అభ్యరి?థత్వం సైతం ఖరారైంది. రాహుల్ గాంధీ వయనాడ్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌లోని ఆమేథీ నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాయ్‌బరేలీ నుంచి ఈసారి ప్రియాంకాగాంధీ పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. 2019 నాటి ఎన్నికల్లో ఆమేథీ నుంచి ఓడిపోయిన రాహుల్ గాంధీ వయనాడ్‌లో గెలిచిన సంగతి తెలిసిందే. తొలి జాబితాను త్వరలో అధికారికంగా విడుదల చేస్తామని కాంగ్రెస్ వెల్లడించింది.

## శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

### వేకువజామునుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు

### అభిషేకాలు, లింగార్చనలు నిర్వహణ

### వేయిస్తంభాల గుడిలో కిషన్ రెడ్డి పూజలు

విజయవాడ/హైదరాబాద్,మార్చి8: తెలుగు రాష్ట్రాల్లో శివరాత్రి శోభతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే శివయ్య దర్శనానికి పోటెత్తారు. శివరాత్రి పండుగ సందర్భంగా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, వేములవాడ, కీసర రామలింగేశ్వర ఆలయం, వేయిస్తంభాల గుడి, కోటిపల్లి, ద్రాక్షారామం, కాళేశ్వరం, కొమురవెల్లి, కొద్వటూరు, చెర్వుగట్టు లింగమంతుల ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. శివయ్యకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గోదావరి నదీ తీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీకాళహస్తి ఆలయంలో గురువారం అర్ధరాత్రి దాటాక భక్తులను దర్శనానికి అనుమతించారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీశైలంలో నేడు పాగాలంకరణ, కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. శివనామస్మరణతో శ్రీగిరి క్షేత్రం మార్మోగుతోంది. మరోవైపు, మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు సైతం వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 11 వరకూ ఈ ఉత్సవాలు సాగనున్నాయి. శ్రీశైలంలో స్వామి, అమ్మవార్ల దర్శనానికి 4 గంటల సమయం పడుతోంది. శుక్రవారం రాత్రి 12 గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఏపీలోని బాపట్ల జిల్లా చినగంజాం మండలం సోపిరాల, కొత్తపాలెం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి దర్శనానికి ఉదయం నుంచే పోటెత్తారు. అటు, కోనసీమ జిల్లాలోని పంచారామ క్షేత్రం ద్రాక్షారామంలో భక్తుల రద్దీ నెలకొంది.

# సంపాదకీయం

శనివారం 09-03-2024

## అవినీతి నేతల పీచమణచాల్సిందే !

ఢిల్లీ లిక్కర్ కేసు చాలా నచిన్నది అంటూ ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యానించారు. కాళేశ్వరంలో అసలు అవినీతే జరగేలదని బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. ఎపిలో జగన్ అన్నిరంగాల్లో అవినీతికి తెరతీసారు. అయినా అవినీతికి తావులేకుండా అని మాట్లాడుతున్నారు. మిగతా రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో అవినీతి తారాస్థాయికి చేరింది. అవినీతి జరిగిందని చెబుతున్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిజెపి నేతలు ఇంచుమాత్రం కూడా చర్యలకు సిద్దంగా లేరు. అవినీతి నేతలను కాపాడుతూ వస్తున్నారు. ఇదో రకమైన అవినీతిగానే గుర్తించాలి. మోడీ అవినీతి చర్యలన్నీ కక్షసాధింపు చర్యలుగానే ఉన్నాయి. తనకు అనుకూలంగా లేని పార్టీల నేతల అవినీతినే భూతద్దంలో చూస్తున్నారు. తెలంగాణలో కెసిఆర్ , ఆయన కుటుంబ అవినీతి, జగన్ అవినీతిని పట్టించుకోవడం లేదు. మొత్తంగా దేశంలో ఇప్పుడు అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడుతున్నది కేవలం రాజకీయనేతలు మాత్రమే. వారే అవినీతిలో కూరుకుపోతున్నారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే రాజమందిరాలు నిర్మించుకోవడం, కోట్లు కూడబెట్టడం, అక్రమాలకు పాల్పడడం చూస్తున్నాం. ఇలా అక్రమ సంపాదనలో మునిగి తేలుతూ ఎన్నికల్లో డబ్బులు పెట్టి ఓట్లను కొల్లగొడుతూ అధికారం చేజారకుండా చూసుకుంటున్నారు. ఒకరని చెప్పడానికి లేదు. అన్నీ ఒకే తాను ముక్కలు. అక్రమాలపై నిలదీస్తే ..ఎదరుదాడి చేయడం అలవాటు చేసుకున్నారు. మోడీ అక్రమాల గురించి ఆధారాలు ఉంటే నిలదీయాల్సిందే. బిజెపి నేతల అక్రమాలు ఉన్నా నిలదీయాల్సిందే. సోషల్ మీడియా ప్రస్తుతం చురుకుగా ఉంది. చీమ చిటుక్కుమన్నా..కోడై కూస్తోంది. ఈ క్రమంలో ఎవరి అక్రమాలను వేలెత్తి చూపినా..వాటి నుంచి బయటపడేందుకు విచారణలను ఎదర్కోవాలి. కడిగిన ముత్యంలా బయట పడాలి. అంతేగానీ ఇడి,సిబిఐ,ఐటిలను తిడుతూ..అధికార పార్టీ బిజెపిపై దండెత్తడం ద్వారా లేదా, ఎదురుదాడి విమర్శలు చేయడం ద్వారా ఎవరు కూడా తమ అక్రమాలను కప్పి పుచ్చుకోవడం కుదరదు. గతేడాది కర్నాటకలో ఓ బిజెపి ఎమ్మెల్యే తనయుడు లక్షలు లంచంగా తీసుకుంటూ అడ్డంగా దొరికి పోయాడు. అక్కడ పర్సంటేజీ ప్రభుత్వం అన్న ప్రచారం రావడంతో ప్రజలు బిజెపిని ఓడించి వాతలు పెట్టారు. మీడియా ఏకి పారేసింది. బిజెపిని తూర్పారా బట్టింది. అలాగే ఎపి సిఎంగా ఉన్న జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని చేసిన అక్రమాలకు జైలులో ఉండివచ్చాడు. ఆ కేసులేమీ తొలగిపోలేదు. ఎప్పటికైనా విచారణ ఎదుర్కోవాల్సిందే. బెయిల్‌పై ఉంటూ పాలన చేస్తున్నారు. తెలంగాణలో కూడా కెసిఆర్ అవినీతి మర్రి ఊడలా పాకింది. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారు. వస్తున్న విమర్శలను పట్టించుకోలేదు. కేంద్రం కూడా చర్యలు తీసుకోలేదు. అందుకే ప్రజలు కెసిఆర్‌ను పక్కన పెట్టారు. అయినా ఇప్పటికీ మేకపోతు గాంభీర్యంతో కొత్తగా వచ్చిన ప్రభుత్వంపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇకపోతే లాలూ ప్రసాద్ యాదవ్, తృణమూల్ మంత్రులు, ఆప్ నేతలు అంతా కూడా అక్రమ సంపాదలో దొరికిన వారే. లిక్కర్ స్కామ్‌లో ఇంకా నేరం రుజువు కాలేదు. అయితే ఆరోపణలు మాత్రమే వస్తున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కవితను విచారణకు పిలిస్తే తాను మహిళను అంటూ వాదిస్తున్నారు. సుప్రీంలో కేసు వేసి విచారణ నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారు. అయినా సిబిఐ మరోమారు విచారించేందుకు రంగం సిద్దం చేశారు. అయినంత మాత్రాన ఇడినో, సిబిఐనో విమర్శించడం తగదు. ఇలాంటి చర్యలతో కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని లొంగ తీసుకోవడం కుదరదని బీజేపీ తెలుసుకోవాలంటూ కవిత చేసిన వ్యాఖ్యలు ఆమె అహంకారాన్ని బయటపెడుతున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగాడుతూనే ఉంటామని ప్రకటించిన నేపథ్యంలో..దానిని వదులుకోమని ఎవరూ చెప్పడం లేదు. దేశ అభ్యున్నతి కోసం గొంతెత్తాల్సిందే. బిజెపి అవినీతిని కూడా ఎండగట్టాల్సిందే. అయితే తమ అవినీతి గురించి మాత్రం మాట్లాడవద్దంటే కుదరదని కవితమ్మ తెలుసుకోవాలి. తనపై వచ్చిన కేసులను తెలంగాణతో ముడిపెట్టి.. తెలంగాణ తలవంచబోదని చెప్పడంలో అహంకారం తప్ప అర్థం లేదు. తెలంగాణ యావత్తుకు కవిత ప్రతినిధి ఏమీ కాదు. తెలంగాణ తలవంచదు కనకనే పోరాటం చేసింది. అందుకే కెసిఆర్ అహంకారన్ని దించేసింది. కేసులు ఎదుర్కోవడం వేరు..అధికార బిజెపిని నిలదీయడం వేరు. ఈ రెండు విషయాలు వేర్వేరని కవిత గుర్తించాలి. అవినీతి కేసులో విచారణ వేరు..రాజకీయ పోరాటం వేరు. లిక్కర్ స్కామ్ బయటకు వచ్చినప్పుడే కవిత అరెస్ట్ తప్పదన్న సంకేతాలు వచ్చాయి. నిజానికి లిక్కర్ స్కామ్ విచారణకు ..విమర్శలకు పొంతన లేదు. ఈ విషయం బిఆర్ఎస్ నేతలు మరోలా మాట్లాడుతున్నారు. నిజానికి కవిత తనకు ఎలాంటి సంబంధంలేదని..కడిగిన ముత్యంలా వస్తే తప్పులేదు.ఆమెకు జనం బ్రహ్మరథం పడతారు. నిజానికి ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు తెలుగు రాష్ట్రాలనే కాదు.. యావత్ దేశాన్నే కదిలిస్తోంది. ఇదే కేసులో ఏపీకి చెందిన వైఎస్ఆర్ సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ఇప్పటికే అప్రూవర్‌గా మారారు. దీంతో ఏపీలో కూడా దీనిపై చర్చ సాగుతోంది. వైసీఆర్ సీపీ సైతం ఆచితూచి స్పందిస్తోంది. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. ఇప్పటి వరకు ఈ అంశంపై స్పందించనేలేదు. నిప్పులేనిదే పొగరాదు. ఈ విషయం కవితకు తెలియంది కాదు. ఇప్పటికే ఈ కేసుల్లో అరెస్ట్ అయిన వారితో, విచారణను ఎదుర్కొంటున్న వారితో వివరాలను రాబట్టిన తరవాతన ఇడి కవితకు నోటీసులు ఇచ్చింది. ఇది గమనించి మాట్లాడాలి. ఇలా ఒక్క కవిత కేసే కాదు...కాళేశ్వరం, మిషన్ భగీరథ, చేపలు, గొర్రెల పథకాల్లో అవినీతి కంపు కొడుతోంది. అవినీతికి ఎవరు పాల్పడినా శిక్షార్హులే. అవినీతిని చీల్చి చెండాడాల్సిందే. అప్పుడే సమాజం బాగుపడుతుంది.

# విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం బోధన్ శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి

### రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలను వర్చువల్ గా ప్రారంభించిన సీ.ఎం‌పాల్గొన్న జెడ్పి ఛైర్మన్, కలెక్టర్









నిజామాబాద్, మార్చి 08 (లోకంతీరు): ఎంతో ప్రాధాన్యతతో కూడుకుని ఉన్న విద్యారంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిపరుస్తూ బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ముందుకెళ్తున్నారని బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. జిల్లాలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం వర్చువల్ గా ప్రారంభోత్సవాలు చేశారు. బోధన్ నియోజకవర్గంలోని రెంజల్ మండలం సాటాపూర్ సమీపంలో నిర్మించిన మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల స్కూల్, కళాశాల భవనాన్ని, నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ పరిధిలోని మోపాల్ మండలం కంజర్ లో నిర్మాణం పూర్తి చేసుకున్న మహాత్మా జ్యోతిబాపులే బీ.సీ. సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ స్కూల్ భవనాలకు ప్రారంభోత్సవాలు చేశారు. సాటాపూర్ లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొనగా, కంజర్ లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతి రెడ్డి పాల్గొన్నారు. జెడ్పి చైర్మన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు భవన సముదాయంలోని వివిధ విభాగాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, మహిళా దినోత్సవం రోజున మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల/పాఠశాల భవనాన్ని ప్రారంభించుకోవడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. విద్యా వ్యవస్థను పటిష్టపర్చడం ద్వారా విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాలన్నీ సొంత భవనాల్లో కొనసాగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ దిశగా కృషి చేస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 80 రోజుల వ్యవధిలోనే సుమారు 30 నుండి 35 వేల వరకు ఉద్యోగాలు భర్తీ చేశారని, అందులో అధ్యాపకుల నియామకాలు సైతం చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకునేలా వారికి నాణ్యమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు హితవు పలికారు. విద్యార్థులు కూడా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలతో చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఉద్బోధించారు. ఈ సందర్భంగా మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలకు తన నియోజకవర్గ నిధుల నుండి 25 కంప్యూటర్లను సమకూరుస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడే పుస్తకాలను సైతం అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అన్ని వసతులతో నూతనంగా అందుబాటులోకి వచ్చిన భవన సముదాయంతో విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా బోధన జరపాలని అధ్యాపకులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలోఆర్డీఓరాజాగౌడ్, జెడ్పి వైస్ చైర్ పర్సన్ రజిత యాదవ్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, ఆర్.సీ.ఓ బషీర్, వహీద్, మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్షియా, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి పర్వదినం సందర్బంగా పలు శివాలయలలో ప్రత్యేక పూజాలు నిర్వహించిన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ









నిజామాబాద్,మార్చ్ 08(లోకంతీరు):మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శ్రీ లింగేశ్వర గుట్ట ఆశ్రమం మల్లారం లో, నంది గుట్ట శివాలయం, శ్రీ రాహు కేతు ఆలయం, శ్రీ భక్త మార్కండేయ భవాని శంకర ఆలయం, ఉమామహేశ్వర ఆలయం, శంభుడి గుడి, నీలకంఠేశ్వర ఆలయం, దేవాలయల లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ :నిబద్ధతకు, అచంచల విశ్వాసానికి, త్యాగానికి ప్రతీక... ఉపవాస దీక్షలతో ,జాగారాలతో సృష్టిలయకారునిగా శివున్ని భక్తి ప్రపత్తులతో కోలుచుకునే పండుగ శివరాత్రి....ఆ మహాదేవుడు ఆయురారోగ్యాలను,సుఖ సంతోషాలుగ ఉండలని భక్తి శ్రద్ధలతో ఆ మహా శివుని వేడుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు, నాగోల్ల లక్ష్మీనారాయణ గారు, కార్పొరేటర్స్, పంచ రెడ్డి ప్రవళిక శ్రీధర్, నీచ్చంగ్ లతా కృష్ణ, మాస్టర్ శంకర్, ఇల్లెందుల మమత ప్రభాకర్, మరియు బిజెపి నాయకులు, శివ నూరి భాస్కర్, హరీష్ రెడ్డి, మఠం పవన్, బట్టి గిరి ఆనంద్, చింతకాయ రాజేందర్, పవన్ ముందాడ, పుట్టా వీరేందర్,బట్టు వెంకటేష్ ,మారవార్ కృష్ణ, సాయినాథ్,రంజిత్,సాయిరాం,వెంకటరమణ, గుండా సతీష్, మురళి, బీజేపీ నాయకులు,తదితరులు పాల్గొనడం జరిగింది.

# అదుపు తప్పుతున్న నిత్యావసర ధరలు

### దిగుమతులతో రైతులకు దక్కని గిట్టుబాటు

న్యూఢిల్లీ,మార్చి8 : దేశంలో ప్రభుత్వాలు అచేతనంగా ఉన్నాయా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. ఈ దేశంలో ఏం జరిగినా పట్టించుకోని రీతిలో కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. ప్రధానంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా..ఎక్కడ లోపం ఉందో గుర్తించడం లేదు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. అయితే మార్కెట్లో మాత్రం ధరలు విపరీతంగా పరుగులు పెడుతున్నాయి. ఉల్లిపాయలకు గిట్టుబాటు ధరలు రావడం లేదని రైతులు ఆందోళన చేస్తున్నారు. దిగుమతుల కారణంగానే ఇలా జరుగుతోందని మహారాష్ట్రలో రైతులు ఆందోళనలకు దిగారు. ఉల్లిపాయలకు గగిట్టుబాటు ధరలు లేవని కర్నూలు జిల్లాలో ఆందోళనలు చేస్తూనే ఉంటారు. ఇక ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మిర్చికి గిట్టుబాటు ధరలు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు తదితర జిల్లాల్లో ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. పసుపు ధరలు గిట్టుబాటు కావడం లేదని నిజామాబాద్ తదితర జిల్లాల్లో రైతులు ఆందోళన చేస్తున్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, దేశానికి అసవరమైన ఉత్పత్తులును పెంచే ప్రయత్నాలు చేయడం లేదు. దేశంలో వరి విపరీతంగా సాగవుతున్నా బియ్యం ధరలు తగ్గడం లేదు. గిట్టుబాటు ధరలు లేవని రైతులు అంటుంటే మార్కెట్లో మాత్రం ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లోపం ఎక్కడో పాలకులు గుర్తించడం లేదు. ప్రజలకు నిత్యావసరాలను తక్కువ ధరలకు అందించే ఏర్పాట్లు చేయడం లేదు. మన వ్యవసాయ భూమలును మన ప్రజలకు అవసరమైన పంటలు పండించేలా మార్చడం లేదు. దేశానికి సమగ్ర వ్యవసాయ విధానం లేకపోవడం వల్లనే ఇలాంటి దుష్ఫలితాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. గ్యాస్ ధరలను పెంచి వంటింట్లో అమ్మకు సెగ పెట్టారు. నిత్యావ సర ధరలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, యూరియా అందడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. మన నేలలు నూనెగింజలకు అనుకూలంగా ఉన్నా నువ్వులు, వేరుశనగ, కుసుమ, పొద్దు తిరుగుడు పంటలను ప్రోత్సహించడం లేదు. వీటిని ప్రోత్సహించి రైతులకు చేదోడు వాదోడు గా ఉండాల్సన ప్రభుత్వాలకు ప్రణాళిక లేకుండా పోయింది. అదే పనిగా దిగుమతుల మీద ఆధారపడడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. కృత్రిమ కొరత సృష్టించి అందినకాడికి దండుకుం టున్నారు వ్యాపారులు. నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగిపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఈ విషయాలను సీరియస్‌గా తీసుకోవాలి. ప్రజలను దోచుకుంటున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

# తెలుగు రాష్ట్రాల్లో శివరాత్రి వేడుకలు



### శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

### నదీతీరాల్లో పుణ్యస్నానాలు..ఆలయాల్లో అభిషేకాలు



హైదరాబాద్,మార్చి8 : తెలుగు రాష్ట్రాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. శివనామస్వరంతో ఆలయాలన్నీ మార్మోగాయి. గోదావరి, కృష్ణానదుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. వేములవాడ, కాళేశ్వరం, వేయిస్తంభాల గుడి, రామప్ప,శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండ, వేములవాడ, కీసర ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఓం నమశ్శివాయా అనే మంత్రాక్షరితో కీసరగుట్ట దేదీప్యమానంగా వెలిగిపోతోంది. భక్తులు ఓం నమశ్శివాయా అంటూ శివుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులు ఉదయం నుంచే శివాలయాలకు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మంత్రులు ఆయా ఆలయాల్లో పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఓం నమఃశివాయ నామ స్వరణతో భక్తులు శివయ్యను దర్శించుకున్నారు.రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం అర్ధరాత్రి నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేసి భక్తులకు మహాలఘుదర్శనం కల్పిస్తున్నారు. రాజరాజేశ్వర స్వామి వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం పట్టు వస్త్రాలు సమర్పించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో శివరాత్రి శోభ సంతరించుకుంది. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వేయిస్తంభాల దేవాలయం, కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. నల్లగొండ జిల్లాలోని శైవక్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చెర్వుగట్టు, పానగల్, వాడపల్లి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. నిజామాబాద్ జిల్లాలో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. జిల్లాలోని నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, బోధన్ ఏకచక్రేశ్వరాలయం, ఆర్మూర్ సిద్దులగుట్ట ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగు తున్నాయి. చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో మహా శివరాత్రి సందర్భంగా చెన్నూరు, గూడెం, లక్షెట్టిపేట, మంచిర్యాల, వేలాల గోదావరి ఘాట్ల వద్ద వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు.

# సినిమా తీరు

# మూవీ రివ్యూ : గామి



నటీనటులు: విశ్వక్సేన్-చాందిని చౌదరి-అభినయ-మొహమ్మద్ సమద్-దయానంద్ రెడ్డి-మయాంక్ పరాఖ్-జాన్ కొట్టోలీ-హారిక పెదాడ తదితరులు
సంగీతం: నరేష్ కుమరన్
ఛాయాగ్రహణం: విశ్వనాథ్ రెడ్డి
స్క్రీన్ ప్లే: విద్యాధర్ కగిత-ప్రత్యూష్ వత్యం
నిర్మాత: కార్తీక్ సబరీష్
రచన-దర్శకత్వం: విద్యాధర్ కగిత

గామి.. చాలా కాలం నుంచి తెలుగు ప్రేక్షకుల నోళ్లలో నానుతున్న చిత్రం. ఆరేళ్ల ప్రయత్నం తర్వాత ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. విశ్వక్సేన్ హీరోగా కొత్త దర్శకుడు విద్యాధర్ కాగిత రూపొందించిన ఈ చిత్రం స్టన్నింగ్ ప్రోమోలతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. అంచనాలూ పెంచింది. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'గామి' ఆ అంచనాలను ఏమేర అందుకుందో తెలుసుకుందాం పదండి.

కథ:శంకర్ (విశ్వక్సేన్) ఒక విచిత్రమైన సమస్యతో బాధ పడుతున్న వ్యక్తి. అతను మరో మనిషిని తాకితే.. తన ఒంట్లో తీవ్రమైన సమస్యలు తలెత్తి చిత్రవధ అనుభవిస్తాడు. యుక్త వయసులో ఒక బాబా తనను అఘోరాలుండే ఓ ఆశ్రమంలో వదిలిపెట్టి వెళ్తాడు. తన గతమేంటో.. తనకీ సమస్య ఎలా వచ్చిందో కూడా శంకర్ కు గుర్తుండదు. శంకర్ సమస్య వల్ల తమకు ఇబ్బందిగా మారడంతో ఆశ్రమం నుంచి అఘోరాలు అతణ్ని వెళ్లగొడతారు. దీంతో తనను ఆ ఆశ్రమానికి చేర్చిన బాబాను వెతుక్కుంటూ కుంభమేళాకు బయల్దేరతాడు శంకర్. అక్కడకి? చేరుకున్నాక తన సమస్యకు పరిష్కారం హిమాలయాల్లోని మాలిపత్రాల్లో ఉందని తెలుసుకుంటాడు శంకర్. 36 ఏళ్లకోసారి వచ్చే వైద్రతిథి నాడే ఆ మాలిపత్రాలను సేవిస్తే తన సమస్య పరిష్కారమవుతుందని అర్థమవుతుంది. మరి ఎన్నో సవాళ్లతో కూడిన ఆ ప్రాంతానికి శంకర్ చేరుకున్నాడా.. తన సమస్యను తీర్చుకున్నాడా.. ఈ ప్రశ్నలకు సమాధానం తెర మీదే చూసి తెలుసుకోవాలి.

కథనం-విశ్లేషణ:ఎప్పుడూ చూసే మూస సినిమాల మధ్య అరుదుగా కొన్ని కొత్త ప్రయత్నాలు జరుగుతుంటాయి. కానీ ఆ ప్రయత్నాలన్నీ విజయవంతం అవుతాయని.. ప్రేక్షకులను మెప్పిస్తాయని చెప్పలేం. కానీ ఫలితం సంగతి అటుంచి ప్రేక్షకులకు ప్రతి సన్నివేశంలో ఒక కొత్త అనుభూతి పంచాలి.. వాళ్లను ఆశ్చర్యపరచాలి.. ఆలోచింపజేయాలి.. అని ఒక తపనతో సినిమాలు తీసేవాళ్లు అరుదుగా ఉంటారు. 'గామి' ప్రోమోలు చూస్తే ఇది అలాంటి ప్రయత్నం లాగే కనిపించింది. కానీ ప్రోమోల్లో కొన్ని మెరుపులు.. సరికొత్త విజువల్స్ తో వావ్ అనిపించి.. ఆ తర్వాత తెర మీద తుస్సుమనిపించేస్తుంటాయి కొన్ని చిత్రాలు. 'గామి' కూడా ఆ కోవకు చెందుతుందేమో అని ప్రేక్షకులకు సందేహాలు కలిగి ఉంటే ఆశ్చర్యం లేదు. కానీ ఇది అలాంటి సినిమా కాదు. ప్రోమోల్లోనే కాదు.. సినిమాగానూ 'గామి' సరికొత్త అనుభూతిని పంచుతుంది. ప్రేక్షకులకు ఎంతమేర రీచ్ అవుతుంది.. కమర్షియల్ గా ఎలాంటి ఫలితాన్నందుకుంటుంది.. ఇలాంటి విషయాలు పక్కన పెడితే.. తెలుగు సినిమా చరిత్రలో 'గామి'కంటూ ఒక పేజీ మాత్రం ఉ ంటుంది. ఇప్పటిదాకా తెలుగు తెరపై చెప్పని కథ ఇది. ఎన్నడూ చూడని విజువల్స్ ఇవి. అలాగే మునుపెన్నడూ కలగని అనుభూతిని కూడా పంచుతుంది 'గామి'.


క్రౌడ్ ఫండింగ్ తో సినిమా అంటే ఏదో చిన్న స్థాయిలో.. మామూలు లొకేషన్లలో సింపుల్ గా ఓ సినిమా తీసేయాలని చూస్తుంటారు. కానీ 'గామి' లాంటి విజువల్ వండర్ తీయాలన్న ప్రయత్నమే అతి పెద్ద సాహసం. కానీ ఇలాంటి సినిమాలు తీయడం మొదలుపెట్టాక బడ్జెట్.. ఇతర కష్టాలతో రాజీపడక తప్పని పరిస్థితి కనిపిస్తుంది. కానీ 'గామి' టీం మాత్రం అడుగడుగునా ఒక అంతర్జాతీయ స్థాయి సినిమా చూస్తున్న భావన కలిగిస్తుంది. హిమాలయాల్లాంటి లొకేషన్లలో తీసిన సీన్లు మాత్రమే కాదు.. ఒక ల్యాబొరేటరీ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు చూసినా.. అత్యున్నత ప్రమాణాలు కనిపిస్తాయి. విజువల్స్ ఆద్యంతం వావ్ అనిపించేలా సాగుతాయి. ఇక ఇందులో విజువల్ ఎఫెక్ట్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. వందల కోట్లు పెట్టే సినిమాల స్థాయిలో కనిపిస్తాయి కొన్ని సన్నివేశాలు. నరేషన్ స్లో అన్న మాటే కానీ.. ప్రతి సన్నివేశంలో ఏం జరుగుతుందా.. విజువల్ గా మనం ఏం మిస్సయిపోతామా అనే క్యూరియాసిటీతో 'గామి'ని నడిపించడంలో దర్శకుడు విజయవంతం అయ్యాడు. కథ పరంగా సస్పెన్సుని చివరిదాకా మెయింటైన్ చేయడంలోనూ దర్శకుడు తన ప్రతిభను చూపించాడు.'గామి' కథ ఎంతో సంక్లిష్టతతో కూడుకున్నది. ఈ కథేంటి అని మాటల్లో చెప్పడం కూడా కష్టం. ఆ కథను విడమరిచి చెప్పకుండా.. అదే సమయంలో ఆసక్తి పోకుండా.. ఒక సస్పెన్స్ మెయింటైన్ చేస్తూ.. ప్రేక్షకులను విజువల్ మాయాజాలంతో మెప్పిస్తూ సినిమాను ముందుకు నడిపించాడు విద్యాధర్. హీరో లక్ష్యమేంటో త్వరగా తెలిసిపోతుంది కానీ.. అతడి కథకు సమాంతరంగా చూపించే రెండు వేరే ట్రాక్స్ ప్రేక్షకులను అయోమయానికి గురి చేస్తుంటాయి. అవి రెండూ కూడా ఒక ప్యానిక్ ఫీలింగ్ కలిగిస్తాయి. ముఖ్యంగా ల్యాబొరేటరీలో చిక్కుకుని ఒక ప్రయోగానికి సబ్జెక్టుగా మారిన కుర్రాడికి సంబంధించిన ఎపిసోడ్ ఒళ్లు గగుర్పొడిచేలా చేస్తుంది. ఆ ఎపిసోడ్ కొంచెం డిప్రెసింగ్ గా అనిపించినా.. అసలేం జరుగుతోందో.. ఆ కుర్రాడు అక్కడ్నుంచి ఎలా బయటపడతాడో తెలుసుకోవాలన్న ఆసక్తి దాన్ని ముందుకు నడిపిస్తుంది. దేవదాసి ఎపిసోడ్ మాత్రం ఏమంత ఆసక్తికరంగా అనిపించదు. మిగతా రెండు ట్రాక్స్ విజువల్ గా కూడా ప్రత్యేకంగా ఉంటాయి

# పుష్ప వెయిట్ పెంచే సూపర్ ఐడియా సుక్కు సర్



అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్ లో రూపొందుతున్న పుష్ప 2 సినిమా పై రోజు రోజుకు అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. గత రెండేళ్లుగా ఈ సినిమా గురించి ప్రతి రోజు ఏదో ఒక వార్త మీడియాలో వస్తూనే ఉంది. తాజాగా మరోసారి ఒక వార్తతో పుష్ప 2 సినిమా సోషల్ మీడియాలో సందడి చేస్తోంది.పుష్ప 2 సినిమాలో కీలకమైన గెస్ట్ రోల్ కు గాను బాలీవుడ్ స్టార్ నటుడు సంజయ్ దత్ ను నటింపజేస్తున్నారట. ఆయన కనిపించేది 7 నుంచి 10 నిమిషాలు అయినా కూడా సినిమాకు అత్యంత కీలకమైన పాత్రగా సుకుమార్ భావిస్తున్నాడు. అందుకే సంజయ్ దత్ ను రంగంలోకి దించబోతున్నాడట. బాలయ్య హీరోయిన్ శివరాత్రి స్పెషల్ విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఇప్పటికే సంజయ్ దత్ తో చర్చలు కూడా పూర్తి అయ్యాయట. సుకుమార్ ఈ సినిమాను పాన్ ఇండియా రేంజ్ లో భారీ ఎత్తున బిజినెస్ చేయాలని చూస్తున్నాడు. అందుకోసం సంజయ్ దత్ వంటి బాలీవుడ్ స్టార్ ను నటింపజేయడం ద్వారా మంచి బిజినెస్ జరిగే అవకాశాలు ఉన్నాయి. బిజినెస్ పరంగా పుష్ప 2 కి కలిసి వచ్చే నిర్ణయాన్ని దర్శకుడు సుకుమార్ తీసుకున్నారు అంటూ నెట్టింట కామెంట్స్ వస్తున్నాయి. బాలీవుడ్ ప్రేక్షులు కూడా సంజయ్ దత్ ఉంటే పుష్ప 2 ను మరింత ఆసక్తిగా చూస్తారని, ప్రీ రిలీజ్ బజ్ కూడా విపరీతంగా ఉండే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాలో అల్లు అర్జున్ కి జోడీగా రష్మిక మందన్న నటిస్తున్న విషయం తెల్సిందే. జాన్వీ కపూర్ తో ఐటం సాంగ్ ను చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయమై క్లారిటీ రాలేదు. ఫాహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో అనసూయ, సునీల్ ఇంకా ప్రముఖ నటీనటులు కనిపించబోతున్నారు.

# అందానికే మరో అందం....



# మట్కా పుకార్లు.. ఫైనల్ గా తేల్చేసిన డైరెక్టర్!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్.. ఇటీవల ఆపరేషన్ వాలెంటైన్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మంచి అంచనాలు క్రియేట్ చేసుకున్న ఈ మూవీ అనుకున్నంత రేంజ్ లో క్లిక్ కాలేదు.. దీంతో ఈ సినిమాతో గట్టి కమ్ బ్యాక్ ఇద్దామనుకున్న వరుణ్ కు నిరాశే మిగిలింది. నెక్స్ట్ మూవీ మట్కాపైనే వరుణ్ ఆశలన్నీ పెట్టుకున్నారు. అయితే ఈ మూవీ నుంచి ఎలాంటి అప్డేట్స్ రావడం లేదు. సంబంధించిన అప్డేట్స్ రాకపోవడంతో మూవీ ఆగిపోయిందని



గతకొద్దిరోజులుగా వార్తలు వస్తున్నాయి. అనుకున్న దానికంటే బడ్జెట్ ఎక్కువ అవుతోందని, వరుణ్ కు వరుస ఫ్లాఫ్ లు రావటంతో సినిమాను ఆపేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఆపరేషన్ వాలెంటైన్ ప్రమోషన్ల సమయంలో వాటిపై వరుణ్ క్లారిటీ ఇచ్చినా.. వార్తలు ఆగడం లేదు. బాలయ్య హీరోయిన్ శివరాత్రి స్పెషల్ తాజాగా ఈ వార్తలను మట్కా డైరెక్టర్ కరుణ కుమార్ ఖండించారు. షూటింగ్ ఆలస్యానికి గల కారణాలను కరుణ కుమార్.. ఓ మీడియాతో తెలిపారు. "నిజానికి మేం ఇప్పటికే మట్కా రెండు షెడ్యూళ్లను కంప్లీట్ చేశాం. 30 శాతం షూటింగ్ పూర్తయింది. ఇటీవల మరో షెడ్యూల్ స్టార్ట్ చేద్దామనుకున్నాం. కానీ ఇంతలో ఆపరేషన్ వాలైంటెన్ టీమ్.. ప్యాచ్ వర్క్ కోసం వరుణ్ ను మళ్ళీ రమ్మంది. దీంతో వరుణ్.. తన రోల్ కోసం హెయిర్ కట్ చేసుకుని వెళ్లారు" అని తెలిపారు. "ఇప్పుడు మట్కా షూటింగ్ స్టార్ట్ అవ్వాలంటే.. వరుణ్ హెయిర్ పెరగాలి. అందుకే షూటింగ్ కాస్త ఆలస్యమైంది. ఈ ప్రాజెక్ట్ కు ఎలాంటి బడ్జెట్ సమస్యలు లేవు. బడ్జెట్ పై వస్తున్న వార్తలన్నీ పుకార్లే. ఇప్పటికే బడ్జెట్ ఫిక్సయ్యాం. మొత్తం పూర్తయ్యేసరికి 10-20 శాతం ఎక్కువ అవ్వొచ్చు. ఇప్పటికే జరిగిన షూటింగ్ పార్ట్ క్వాలిటీని చూసి నిర్మాతలు హ్యాపీగా ఉన్నారు" అంటూ కరుణ్ కుమార్ క్లారిటీ ఇచ్చారు. వైరా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల భారీ బడ్జెట్ తో మట్కా మూవీని నిర్మిస్తున్నారు. 1958 లో జరిగే కథ కావడంతో 60, 80ల మధ్య వాతావరణాన్ని రీక్రియేట్ చేసేందుకు భారీ సెట్లను రూపొందించారు. వరుణ్ తేజ్ సరసన బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా యాక్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ నుంచి స్పెషల్ అప్డేట్ రానుందని సమాచారం.

# మన పూర్వీకులు 'ఈ' 5 పదార్థాలు తినడం వల్ల మధుమేహం లేకుండా జీవించారు... అదేంటో తెలుసా?



మన పూర్వీకులు "ఆహారమే ఔషధం, ఔషధమే ఆహారం" అని బతికారు. పురాతన కాలంలో మన పూర్వీకులకు దీర్ఘకాలిక వ్యాధులతో చాలా సమస్యలు లేవు. ఎందుకంటే వారు అనుసరించిన ఆహారం మరియు జీవనశైలి ఆరోగ్యకరమైనవి. నేడు మనం అనుసరిస్తున్న జీవనశైలి వల్ల దీర్ఘకాలిక వ్యాధులు మరియు వివిధ రకాల ఇన్ఫెక్షన్లకు లోనయ్యేలా చేస్తుంది. డైట్ ను సక్రమంగా పాటించడం ద్వారా మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఆరోగ్యంగా జీవించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఛాతీలో నొప్పిగా అనిపిస్తోందా? అది గుండెపోటు లేదా గ్యాస్ట్రిక్ కారణంగా వస్తోందా? ఇలా గుర్తించండి పురాతన కాలం నుండి, అనేక సుగంధ ద్రవ్యాలు మరియు మూలికలు ఆరోగ్యం కోసం ఉ పయోగించబడుతున్నాయి. ఇన్సులిన్ అసమతుల్యతకు చికిత్స చేయడానికి మరియు మీ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి పురాతన మరియు ప్రత్యామ్నాయ వైద్యంలో ఇవి ఉపయోగించబడ్డాయి. ఆ సుగంధ ద్రవ్యాలు మరియు మూలికలను వెతకడానికి మీరు ఎక్కడికీ వెళ్లవలసిన అవసరం లేదు. మీ మధుమేహాన్ని నియంత్రించడానికి మీ వంటగదిలో సహజ నివారణలు ఉన్నాయి. అధిక చక్కెర మరియు ఇన్సులిన్ సెన్సిటివిటీకి చికిత్స చేయడానికి ఆరోగ్య నిపుణులు బలమైన మందులు లేదా ఇంజెక్షన్‌లను సూచిస్తారు. ఇప్పుడు మీరు ఇంట్లో మీ చక్కెర స్థాయిని నియంత్రించవచ్చు. ఇన్సులిన్ అసమతుల్యతను నియంత్రించడానికి మీ రోజువారీ ఆహారంలో చేర్చగలిగే సుగంధ ద్రవ్యాలు మరియు మూలికల గురించి తెలుసుకోండి. ధూమపానం మానేసిన తర్వాత శరీరంలో ఏమి జరుగుతుందో తెలుసా? పసుపు పసుపులో కర్కుమిన్ క్రియాశీల సమ్మేళనం. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందింది. అవి మీ రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో కూడా సహాయపడతాయి. యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో, ఈ సాధారణ మసాలా యొక్క సాధారణ మరియు మితమైన వినియోగం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇవి మీ బ్లడ్ షుగర్ లెవల్స్ ను తగ్గించి మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఈ సాధారణ మసాలాను టీలు, స్మూతీలు, సూప్‌లు మరియు కూరగాయల వంటకాలకు జోడించవచ్చు. మెంతికూర మెంతి గింజలు మరియు ఆకులలో ఫైబర్ మరియు కరిగే సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. మెంతి గింజలను రాత్రంతా నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగడం మంచిది. సైలెంట్‌గా ప్రాణాలను తీసే ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ గురించి మీరు తెలుసుకోవలసిన విషయాలు! ఇవి ప్రాచీన కాలం నుండి మన పూర్వీకులు అనుసరించిన పురాతన మార్గాలు. మీ రోజువారీ ఆహారంలో ఈ మసాలాను జోడించడానికి మరొక మార్గం మెంతి గింజలను తయారు చేయడం ద్వారా డిటాక్స్ టీని తయారు చేయడం. దాల్చిన చెక్క దాల్చినచెక్క సహజంగా ఇన్సులిన్‌ను నియంత్రించే మరియు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడే సమ్మేళనాలను కలిగి ఉంటుంది. కొన్ని అధ్యయనాలు దాల్చిన చెక్కను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గ్లూకోజ్ మెటబాలిజం మెరుగుపడుతుందని సూచిస్తున్నాయి. మీరు వోట్మీల్, పెరుగు వంటి ఆహారాలకు దాల్చిన చెక్క పొడిని జోడించవచ్చు లేదా మీ టీ లేదా కాఫీకి జోడించవచ్చు. కిలోయ్ కిలోయ్ అని కూడా పిలువబడే కిలోయ్ ఒక భారతీయ మూలిక. ఇది సాంప్రదాయకంగా దాని సంభావ్య ఆరోగ్య ప్రయోజనాల కోసం ఉపయోగించబడుతుంది. అధ్యయనాల ప్రకారం, కిలోల రెగ్యులర్ వినియోగం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడం మరియు ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ప్యాంక్రియాటిక్ కణాలను రక్షించే యాంటీఆక్సిడెంట్ లక్షణాల వల్ల ఇది జరుగుతుంది. గూస్బెర్రీ గూస్బెర్రీ అని కూడా పిలువబడే ఉసిరికాయలో విటమిన్ సి మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మీరు దీన్ని తాజాగా, రసం లేదా పొడి రూపంలో తీసుకోవచ్చు.

# బెంగాల్ నుంచి బీజేపీ బరిలో షమీ..?

కోల్ కత్తా, మార్చి8 టీమిండియా చెందిన మరో స్టార్ క్రికెటర్ రాజకీయ రంగ ప్రవేశం చేయనున్నట్లు తెలుస్తోంది. భారత్ వేదికగా జరిగిన ప్రపంచకప్‌లో అద్భుత బౌలింగ్‌తో అదరగొట్టిన స్టార్ పేసర్ మహ్మద్ షమీరాజకీయ రంగ ప్రవేశం చేయనున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. షమీ బీజేపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో షమీ పశ్చిమ బెంగాల్ నుంచి పోటీ చేయనున్నట్లు పేర్కొన్నాయి.ఇటీవలే షమీ గురించి మోదీ ట్వీట్‌చీలమండ గాయం కారణంగా క్రికెట్ కు దూరంగా ఉన్న భారత పేసర్ మహమ్మద్ షమీ తనకు లండన్‌లో జరిగిన శస్త్రచికిత్స



విజయవంతమైందంటూ సోషల్ మీడియా వేదికగా ఫొటోలను పంచుకున్నాడు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తన ఆపరేషన్ విజయవంతంగా జరిగిందని, కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని షమీ చెప్పాడు. అయితే ఈ విషయంపై ప్రధాని స్పందించారు. శస్త్రచికిత్స చేయించుకున్న ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ త్వరగా కోలుకోవాలని భారత ప్రధాని మోదీ ఆకాంక్షించారు. షమీ వీలైనంత త్వరగా గాయం నుంచి కోలుకొని దేశం తరపున ఆడాలని కోరుకుంటున్నానని ఆయన ట్వీట్ చేశారు.గత నవంబరులో ప్రపంచకప్ ఫైనల్‌లో చివరి మ్యాచ్ ఆడాడు షమ్మీ. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌తో పాటు దక్షిణాఫ్రికా పర్యటనకు దూరమయ్యాడు అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు కూడా అందుబాటులోకి రాలేదు. గాయం కారణంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌కు అతనికి విశ్రాంతి ఇచ్చారు. జనవరి చివరి వారంలో లండన్‌లో కొన్ని చీలమండ ఇంజెక్షన్లు తీసుకున్న షమి తేలికపాటి పరుగులు సాధన చేశాడు. అయితే 3 వారాల తర్వాత ఇంజెక్షన్ల ప్రభావం పూర్తిగా తగ్గిపోవడంతో నొప్పి మళ్లీ తిరగబెట్టింది. ఇక శస్త్రచికిత్స మినహా మరే మార్గంలేదని బీసీసీఐ వర్గాలు చెప్పాయి. నొప్పితోనే ప్రపంచకప్ ఆడిన షమి ఆ ప్రభావం మ్యాచ్‌లపై పడనివ్వలేదని సమాచారం..కష్టాల ప్రయాణం చేసిఒకప్పుడు భార్య పెట్టిన గృహ హింస కేసు, వ్యక్తిగత జీవితంలో ఆటుపోట్లు, కోర్టు సమన్లు ఆత్మహత్య చేసుకొందామన్న ఆలోచనలు రోడ్డు ప్రమాదం ఇలా ఒకటా రెండా షమిని సమస్యలు చుట్టుముట్టాయి. అయినా షమీ వెనక్కి తగ్గలేదు. ఇంకా దృఢంగా తయారయ్యాడు. చాలాకాలం వరకు జట్టులో చోటు దొరకకపోయినా కుంగిపో లేదు. తానేంటో నిరూపించుకోవాలన్న కసితో తీవ్రంగా సాధన చేశాడు. దానికి తగ్గ ఫలాలను అందిస్తున్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూ లో తన కుటుంబం గురించి మీడియా తో పంచుకున్నాడు. తన కుమార్తె ఐరాను కలుసుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తంచేశాడు. కుటుంబ విభేదాల వల్ల కొన్నాళ్లుగా షమీ తన భార్య హసిన్ జహాన్‌కు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కుమార్తెను చూడటానికి, మాట్లాడటానికి తనను అనుమతించడం లేదని, కొన్ని సందర్భాల్లో మాత్రమే మాట్లాడుతున్నానని తెలిపాడు. ఎవరూ తన కుటుంబాన్ని, పిల్లలను కోల్పోవాలనుకోరు. కానీ కొన్ని పరిస్థితులు మన చేతుల్లో ఉండవు అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తాను ఆరోగ్యంగా ఉంటూ అన్నింటిలో విజయం సాధించాలని కోరుకుంటున్నానన్నాడు.

# పనికిరాడని పక్కనెట్టేశారు.. కట్ చేస్తే.. 51 బంతుల్లో రోహిత్ ఫ్రెండ్ ఊహకందని ఊచకోత..

ఈ ప్లేయర్ పనికిరాడని బీసీసీఐ పక్కనపెట్టేసింది. తమకు ఓపెనింగ్ బ్యాటర్లు వాళ్ల ముగ్గురే అని.. ఈ ప్లేయర్ ఇక రిటైర్మెంట్ ప్రకటించుకోవచ్చునని పరోక్షంగా అనేసింది.కట్ చేస్తే.. అవకాశాలు లేవు.. అయితేనేం.. రాబోయే ఐపీఎల్ 2024లో సత్తా చాటేందుకు డొమెస్టిక్ టోర్నమెంట్‌లో దుమ్ముదులిపాడు ఈ విధ్వంసకర ఓపెనర్.ఐపీఎల్ 2024 సీజన్ ఆరంభానికి ముందు పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శిఖర్ ధావన్ జూలు విదిల్చాడు. ముంబై వేదికగా జరుగుతోన్న డీవై పాటిల్ టోర్నీలో అదరగొట్టే ఇన్నింగ్స్‌తో దుమ్ములేపాడు. డీవై పాటిల్ బ్లూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోన్న శిఖర్ ధావన్.. ఇటీవల సీఏజీతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగిపోయాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.